క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: ఓల్డ్ ముంబయి రోడ్డు ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. లింగంపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల నేపథ్యంలో మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చందానగర్ మెయిన్ రోడ్డు, బీహెచ్ఈఎల్ ఏరియా, వేముకుంట, ఓల్డ్ ముంబయి రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

యువతరానికి స్ఫూర్తి ఛత్రపతి శివాజీ



శివాజీ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, ఈటల రాజేందర్

పటాన్‌చెరు: యువతరానికి స్ఫూర్తి ప్రదాత ఛత్రపతి శివాజీ అని, అతను గొప్ప పరిపాలన దక్షుడని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం రాత్రి పటాన్‌చెరు మండలం భానురు గ్రామంలో ఏర్పాటుచేసిన భారీ ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని వేలాది మంది సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. చరిత్రలో గొప్ప నాయకులుగా కీర్తించబడ్డ మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. యువత పెడదారి పట్టకుండా దేశ భవిష్యత్ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, భానూర్ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు దశరథ రెడ్డి, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

దేవాలయాలతో ఆధ్యాత్మిక శోభ



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: దేవాలయాల నిర్మాణంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ చోటు చేసుకుంటుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. చిట్కుల్ గ్రామ పంచాయతీ సన ఫేజ్-2 శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి రూ.6,50,000లు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నీలం మధును ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...గ్రామాల్లో మరిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టి, ప్రజలకు అందుబాటులో ఉండేలా స్వామివారిని ఆశీర్వదించాలని కోరానన్నారు. రానున్న కాలంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు సునీల్, రామచంద్రారెడ్డి, నరేందర్ రెడ్డి, శివారెడ్డి, రాజప్ప, వీరభద్ర పాల్గొన్నారు.

యువకుడికి సన్మానం

జిన్నారం(పటాన్‌చెరు): దోమడుగు గ్రామానికి చెందిన పవన్‌కుమార్ ఇటీవల ఆర్మీలో చేరిన సందర్భంగా సోమవారం ఎంపీటీసీ సభ్యుడు గోవర్ధన్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణకు విద్యార్థులు భాగమైన ఆర్మీలో చేరడం సంతోషంగా ఉందన్నారు.

రోడ్డు మధ్యలో బోర్డులు

ఇబ్బందుల్లో జనం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రేడియల్ రోడ్డుపై నిత్యం ఏదో ఒక చిన్నపాటి ప్రమాదం జరుగుతూనే ఉంది. వాటిని నియంత్రించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ మున్సిపల్ అధికారుల్లో చలనం లేదు. తెల్లాపూర్ అలియాన్స్ చౌరస్తా నుంచి ఉస్మాన్ నగర్ వెళ్లే రేడియల్ రోడ్డు మధ్యలో డివైడర్‌ను నిర్మించలేదు. దీంతో రోడ్డు పక్కన ఉండే దుకాణదారులు దర్జాగా వారి దుకాణాలకు సంబంధించిన బోర్డులను పెడుతున్నారు. రోడ్డు మధ్యలో బోర్డుల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పెండింగ్ చలాన్లపై ఫోకస్!

మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుమన్



హఫీజ్‌పేట్: రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా జరుగుతున్న ప్రమాదాలపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక నిఘాతో పాటు పలు నివారణ చర్యలు చేపట్టారు. మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మియాపూర్, చందానగర్, రామచంద్రాపురం ప్రాంతాలలో నిబంధనలు ఉల్లంఘించే వారి కోసం ప్రత్యేక చెక్ పాయింట్లు పెడుతున్నారు. గ్రామ శివారు నుంచి నగరంలోకి వస్తున్న వాహనాలు నియమాలు పాటించడంపై 24 గంటలూ తనిఖీలు చేస్తున్నారు. మొదట గ్రామాల నుంచి వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తున్నారా లేదా, హెల్మెట్ లేనివారికి హెల్మెట్ వాడకంపై, నెంబర్ ప్లేట్ లేని వాహనాలకు, డ్రంక్ అండ్ డ్రైవ్, నో ఎంట్రీ సమయాలలో భారీ వాహనాలకు నగరంలోకి రాకుండా తీసుకుంటున్న చర్యలపై మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుమన్‌తో 'సాక్షి' ఇంటర్వ్యూ...

ప్రశ్న: డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్ పోస్టులను ప్రారంభించారా?

జవాబు: మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహిస్తున్నాం. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి వాడిన స్ట్రా మరొక వాహనాదారుడికి వాడటం లేదు. ర్యాండంగా వాహనదారులను తనిఖీలు చేస్తున్నాం. అనుమానం ఉన్న వాహనదారుడిని ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్ చేస్తాం.

ప్రశ్న: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వారి వాహనాలను సీజ్ చేస్తున్నారా?

జవాబు: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారి వాహనాలను సీజ్ చేయడం లేదు. మద్యం సేవించిన వారికి సంబంధించిన వారు వచ్చి వాహనానికి సంబంధించిన పత్రాలు చూపించి తీసుకెళ్లొచ్చు. తిరిగి కోర్టుకు వెళ్లే ముందు ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్‌ను పోలీస్ స్టేషన్‌లో అందజేయాలి. అనంతరం డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆర్టీఐకు పంపిస్తాం. 6 నెలల పాటు లైసెన్స్‌ను రద్దు చేయడం జరుగుతుంది.

ప్రశ్న: సీజ్ చేసిన వాహనాలను తిరిగి వాహనదారులకు అప్పగించారా?

జవాబు: మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో సీజ్ చేసిన వాహనాల పత్రాలను పరిశీలించి తిరిగి వారికి అందజేస్తాం. సీజ్ చేసిన వాహనాలను తిరిగి వాహనదారులు సరైన పత్రాలను చూపించి తీసుకెళ్లకుంటే మూడు సార్లు సంబంధిత ఫోన్ నెంబర్‌కు మెసేజ్‌లు, ఫోన్‌కాల్, నోటీసులు అందిస్తున్నాం. వాటికి కూడా స్పందించకుంటే సైబరాబాద్ కమిషనర్ ఆదేశాల మేరకు వాహనాలను వేలం వేస్తాం.

ప్రశ్న: ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలను ఇష్టానుసారంగా నడిపి ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా రాంగ్ రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, లేబర్ క్యారీయింగ్ చేస్తున్న వాహనాలను, ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్న వారిని, డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, డేంజరస్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక నిఘా ఉంచి స్పెషల్ టీంల ద్వారా వారిని చెక్ చేసి చలాన్లు విధించి, కేసులు చేయాల్సిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.

ప్రశ్న: పెండింగ్ చలాన్లు ఉన్న వాహనాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: స్పెషల్ టీంల ద్వారా చెక్ పాయింట్‌ను ఏర్పాటు చేసిన పెండింగ్ చలాన్లపై వాహనాలను తనిఖీలు చేస్తున్నాం. పెండింగ్ చలాన్లు ఉన్న వాహనాలను ఆపి పూర్తిగా పెండింగ్‌లో ఉన్న చలాన్లు కట్టే వరకు వాహనాలను వదలడం లేదు. వాహనాలకు ఉన్న నెంబర్ ప్లేట్లు కనబడకుండా కొంతమంది విరగొట్టడం, మాస్కులు పెట్టడం, బట్టలు అడ్డుపెట్టడం, నెంబర్ పేట్లు మార్ఫింగ్ చేయడం వంటివి చేస్తే చట్ట రీత్య చర్యలు తీసుకుంటాం.

ట్రాఫిక్ సమస్యలకు సంబంధించి ఈ నంబర్లలో సంప్రదించాలి	
మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుమన్:	94910 39172
ఆర్ఐ సురేష్:	94906 17353
ఎస్ఐ రమేష్:	94910 39162
ఎస్ఐ సుభాష్:	87126 63542

ప్రశ్న: ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారా?

జవాబు: ట్రాఫిక్ నిబంధనలపై ప్రధాన కూడలిలలో వాహనదారులకు ప్రత్యేక టీంల ద్వారా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. గతంలో రోడ్లపై ట్రాఫిక్ జాంలు ఏర్పడేవి, కానీ ఇప్పుడు ట్రాఫిక్ జాంలు కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. రెండు సంవత్సరాల నుంచి ట్రాఫిక్ సమస్యలపై చాలా మార్పులు తీసుకువచ్చాం.

ప్రశ్న: నో ఎంట్రీ వాహనాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఉదయం, సాయంత్రం వేలల్లో నో ఎంట్రీ సమయాలలో భారీ వాహనాలు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. లారీలు, టిప్పర్లు, ప్రైవేట్ వాహనాలు, ట్యాంకర్లు, బస్సులు తిరగకుండా కట్టదిట్టడం భద్రత కల్పిస్తున్నాం. రద్దీ సమయాలలో భారీ వాహనాలకు అనుమతి లేదు. వస్తే మాత్రం చట్ట రీత్య చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: లోక్ అదాలత్‌లో ఎన్ని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పరిష్కారం అయ్యాయి?

జవాబు: ఇటీవల నిర్వహించిన లోక్ అదాలత్‌లో మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 1450 వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పరిష్కారం అయ్యాయి.



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ సుమన్ (ఫైల్)

మెడికేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అత్యాధునిక వసతులు



నూతన ఎంఆర్ఐ స్కానింగ్ పరికారాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని మియాపూర్ మెడికేర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అడ్వాన్స్‌డ్ ఎంఆర్ఐ పరికరాన్ని సోమవారం కార్పొరేటర్లు జగదీశ్వర్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి ఆస్పత్రి డైరెక్టర్ సురేష్, సీఈఓ దినేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాతుతూ... మెడికేర్ ఆస్పత్రిలో అన్ని రకాల పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేయనున్నారని తెలిపారు. అత్యాధునిక టెక్నాలజీతో 1.5 టెస్ల సిస్టంతో ఎంఆర్ఐ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు దీనివల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, ఎంఆర్ఐ స్కానింగ్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా మియాపూర్ మెడికేర్ హాస్పిటల్ అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. శేరిలింగంపల్లి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెడికేర్ వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖాజాగూడకు మంత్రి కేటీఆర్ రాక

గచ్చిబౌలి: గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడలోని పెద్ద చెరువు పునరుద్ధరణ, సమగ్ర అభివృద్ధి పనులకు రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు మంగళవారం శంకుస్థాపన చేయనున్నారు. దివ్యశ్రీ ఎన్ఎస్ఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, మిడాస్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులతో కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, నగర మేయర్ విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు కేశవరావు, ఎంఎల్‌సీ సుంకరిరాజు, మహేందర్‌రెడ్డి, వాణీదేవి, నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పాల్గొంటారని అధికారులు తెలిపారు.

ఘనంగా మైసమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

రాయదుర్గం: మధురానగర్‌లోని ఎదురు గడ్డమైసమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకుల సమక్షం, ఆలయ కమిటీ, స్థానికుల ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మైసమ్మ అమ్మవారికి 20 లీటర్ల పాటు, 10 లీటర్ల పెరుగు, 5 లీటర్ల తేనె, 3 కేజీల చక్కెర, 2 కేజీల కుంకుమ, 2 కేజీల పసుపు, 2 కేజీల గంధం తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. రాయదుర్గం, మధురానగర్, ఖాజాగూడ, ప్రశాంత్‌హిల్స్ కాలనీల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో నక్షత్ర హారతితో వార్షికోత్సవాలు ముగిశాయి.

ఆలయాల అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్‌కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో ప్రార్థన మందిరాలు, ఆలయాల నిర్మాణాలకు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ లలితసోమిరెడ్డి, కౌన్సిలర్ జ్యోతి, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ మాల్లారెడ్డి, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మణిరత్నం సినిమానే ప్రేరణ

సినీ దర్శకుడు, నిర్మాత, నటుడు గౌతమ్ మీనన్



పటాన్‌చెరు టౌన్: ప్రముఖ దర్శకుడు మణిరత్నం నాయగన్ సినిమా సినీ రంగంలో అడుగుపెట్టడానికి తనకు ప్రేరణ అని, ఆ సినిమాలో ఉన్న వాటిని తన సినిమాల్లో చూపించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రసిద్ధ భారతీయ సినీ దర్శకుడు, నిర్మాత, నటుడు గౌతం వాసుదేవ్ మీనన్ అన్నారు. రుద్రారంలోని గీతం విశ్వవిద్యాలయంలో రివైండ్ ద మిలీనియమ్ ఇతివృత్తంతో సోమవారం నిర్వహించిన టెడ్‌ఎక్స్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. తాను అనుకున్నది, తన జీవితంలో ఎదురైన సంఘటలనే సినిమాగా తీస్తానన్నారు. కష్టపడకుండా ఏదీ సాధించలేమని, ఏదైనా ఒక కళలో నైపుణ్యం సాధించాలంటే పూర్తి దృష్టిని కేంద్రీకరించాలని ప్రముఖ భరతనాట్య నృత్యకారిణి సవితా శాస్త్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండీ మ్యూజిక్ ఆర్టిస్ట్ నితీశ్ కొండపర్తి, సిస్సీ ఐస్ పాప్స్ వ్యవస్థాపకుడు రని కాబ్రా, విద్యార్థులు పాల్గొన్నారు.

రాంకీపెరల్ కాలనీ సీసీరోడ్డు పనులు ప్రారంభం

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని రాంకీ పెరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.1.5 కోట్లతో చేపట్టబోయే సీసీరోడ్డు నిర్మాణ పనులను సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాంకీపెరల్ కాలనీలో సొంత నిధులతో సీసీరోడ్డు నిర్మాణం చేసుకోవటంతో ఆదర్శంగా నిలిచారన్నారు. ఇది అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. రాంకీ పెరల్ కాలనీవాసులకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.

ఘనంగా 'న్యూ ఎరా'లో గ్రాడ్యుయేషన్ డే

అల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌లోని న్యూ ఎరా పాఠశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. పీపీ-1, పీపీ-2 తరగతులను విజయవంతంగా పూర్తి చేసుకున్న చిన్నారులు ప్రాథమిక తరగతుల్లోకి ప్రవేశిస్తున్న సందర్భంగా గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ వేణుగోపాలరెడ్డి తెలిపారు. అకడమిక్ ఇన్‌చార్జ్ అపర్ణ, ప్రైమరీ ఇన్‌చార్జ్ గౌతమిలతో కలిసి ఆయన విద్యార్థులకు పట్టాలను అందజేశారు. చిన్నారుల చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలి

మూసాపేట: మూసాపేట కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ సోమవారం ఈఈ సత్యనారాయణ, డీఈ శ్రీదేవి, ఏఈ రంజిత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌లతో సమావేశమయ్యారు. మూసాపేట డివిజన్‌లో శంకుస్థాపనలు చేసి ఇప్పటి వరకు మొదలు కాని పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఉన్న పెండింగ్ పనులను రెండు, మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలి



సాయిభవ్‌కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను అర్ధరాత్రి తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

- ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- అర్ధరాత్రి అభివృద్ధి పనుల తనిఖీలకు ఎమ్మెల్యే శ్రీకారం

రాయదుర్గం: అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. గచ్చిబౌలి డివిజన్‌లోని సాయి వైభవ్ కాలనీలో రూ. 30 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన ఆదివారం అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత ఎంత వరకు పాటిస్తున్నారనే విషయాన్ని ఆయన స్వయంగా తనిఖీ చేసి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విపత్కర పరిస్థితుల్లో సంక్షేమం, అభివృద్ధి ఆగిపోకూడదనే ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేయడంతోనే విరివిగా అభివృద్ధి పనులను మంజూరు చేస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవతోనే శేరిలింగంపల్లికి భారీ ఎత్తున నిధులు మంజూరయ్యాన్నారు. శేరిలింగంపల్లిలో శేరిలింగంపల్లి చరిత్ర ఎన్నడూ లేని విధంగా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, థీమ్‌పార్కులు, అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మార్చడం, ప్రధానం రోడ్లను బీటీ రోడ్లుగా, పలు కొత్తగా లింకురోడ్లు నిర్మాణం, చెరువుల సుందరీకరణ, నాలాల విస్తరణ, వరద నీటి కాలువల నిర్మాణం చేపడుతున్నామన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సమీక్షా సమావేశాల్లో అధికారులకు స్పష్టం చేశామని గుర్తు చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతను పరిశీలించడానికే అర్ధరాత్రి చేపట్టే పనులను ఆకస్మికంగా వెళ్లి తనిఖీలు చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రతికాలనీ, బస్తీల్లో మెరుగైన వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిధుల మంజూరును బట్టి దశలవారీగా అన్ని పనులను పూర్తి చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు జీహెచ్ఎంసీ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తాం

- ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ
- అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందేలా చర్యలు



టీయూడబ్ల్యూజే కూకట్‌పల్లి నియోజకవర్గం నూతన కమిటీ ఎన్నిక సమావేశంలో పాల్గొన్న నాయకులు

కూకట్‌పల్లి: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే) సంఘం పాత్రికేయుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తోందని... అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ పేర్కొన్నారు. కూకట్‌పల్లిలోని చిత్తారమ్మ దేవాలయం ప్రాంగణంలో సోమవారం టీయూడబ్ల్యూజే కూకట్‌పల్లి నియోజకవర్గం నూతన కమిటీ ఎన్నిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా అల్లం నారాయణతో పాటు టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతిసాగర్ హాజరయ్యారు.

◆ ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో నియోజకవర్గాల వారీగా జర్నలిస్టులకు స్థానిక ఎమ్మెల్యేలు ఇళ్ల స్థలాలు అందిస్తూ వస్తున్నారని చెప్పారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో పనిచేసే జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. మారుతిసాగర్ మాట్లాడుతూ... రాష్ట్రస్థాయి నుంచి, మండల స్థాయి వరకు పని చేస్తున్న ప్రతి ఒక్క జర్నలిస్టుకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లతో పాటు ప్రభుత్వ పథకాలు అందేలా యూనియన్ కృషి చేస్తుందని చెప్పారు.

◆ ఈ సందర్భంగా కూకట్‌పల్లి కమిటీ నూతన అధ్యక్షుడు మహేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి భాస్కర్ చారిలకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు విద్యా వెంకట్, ఆర్కే దయాసాగర్, నిమ్మల శ్రీనివాస్, మల్లేశం, తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంధం రాములు, దరువు అంజన్న, పీవీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న స్వామి ఆలయానికి విరాళం

పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్‌లో శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామి జాతరకు ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్ రూ.లక్ష విరాళం అందజేశారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శ్రీకాంత్ గౌడ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలం, మల్లేశ్, నాగరాజు, మల్లేశం పాల్గొన్నారు.

పర్వదినాలకు పటిష్ట ఏర్పాట్లు చేయండి



పర్వదినాల ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

- రంజాన్, శ్రీరామనవమి వేడుకల నిర్వహణపై జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో సమీక్ష
- ప్రశాంత వాతావరణంలో సోదరభావంతో జరుపుకోవాలి
- ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: పర్వదినాలను ఘనంగా నిర్వమించుకునేలా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధికారులకు సూచించారు. రంజాన్, శ్రీరామనవమి పర్వదినాల నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ జోనల్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... అన్ని రకాల పర్వదినాలను ప్రశాంత వాతావరణంలో సోదర భావంతో జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రంజాన్‌కు మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, మసీదు, పరిసరాలను పరిశుభ్రంగా ఉండే చర్యలు చేపట్టాలని, తాగునీటి సమస్య లేకుండా చూడాలని సూచించారు. విద్యుత్ దీపాలు వెలిగేలా చూడాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. శ్రీరామనవమి వేడుకలు, ర్యాలీలు, ఉత్సవాల కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయాల్లో జరిగే సీతారాముల కల్యాణాత్సవానికి ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. ప్రజల్లో శాంతియుత వాతావరణంలో పర్వదినాలు జరుపుకొనేలా అధికారులు చూడాల్సిన అవసరం ఉందన్నారు. వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ శంకరయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, జగదీశ్వర్‌గౌడ్, ఉప్పలపాటిశ్రీకాంత్, మంజుల రఘునాథ్‌రెడ్డి, మదాపూర్ ఏసీపీ రఘునందన్‌రావు, మియాపూర్ ఏసీపీ నర్సింహారావు, ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మీ, డీసీ సుధాంష్, జీహెచ్ఎంసీ ఎస్ఈ శంకర్‌నాయక్, జలమండలి జీఎం రాజశేఖర్, ఈఈ శ్రీనివాస్, ఈఈశ్రీకాంతిని, ఏఎంఓహెచ్‌లు నగేష్‌నాయక్, కార్తీక్, ఇన్‌స్పెక్టర్లు సురేష్, తిరుపతిరావు, క్యాస్ట్రో రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు నర్సయ్య, సుమన్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.